క్లుప్తంగా

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో సూచనలిస్తున్న వైద్యాధికారి శ్రీవిద్య

మాకవరపాలెం: వైద్య సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని వైద్యాధికారి శ్రీవిద్య సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

అయ్యేరక స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా

నర్సీపట్నం: అయ్యేరక స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి కనకమహాలక్ష్మి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేసినట్లు ఆమె తెలిపారు. తనకు పదవి ఇచ్చిన మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మి, రాంగోపాల్ దంపతులు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు అధైర్య పడొద్దన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. మళ్లీ పార్టీ విజయం కోసం కృషి చేస్తామన్నారు.

వరి విత్తనాలకు ప్రతిపాదనలు

రోలుగుంట: ఖరీఫ్‌లో వరి సాగుకు సంబంధించిన విత్తనాలకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్టు మండల వ్యవసాయాధికారి ఎస్. విజయలక్ష్మి తెలిపారు. మండలంలో ఎప్పటి మాదిరిగానే ఆర్జీఎల్ వరి విత్తనాలే అధిక సంఖ్యలో రైతులు కోరుతున్నారన్నారు. ఈ విత్తనం ఉత్పత్తయి 30 ఏళ్లు పైబడినందున పంట దిగుబడి ఆశించినట్టుగా ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. రైతులు ఈ విషయం గమనించి ప్రత్యామ్నాయ రకాలు సాగు చేయాలన్నారు. ఈ వారంలో వరి విత్తనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తామన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

రోలుగుంట: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఆవరణలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో నిర్వహించనున్నట్టు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మద్దు తాతబాబు మంగళవారం తెలిపారు. శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా నేత్ర పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. శుక్లం ఆపరేషన్‌కు ఎంపికైన నిరుపేదలకు డాక్టర్ సలహా మేరకు కాటరాక్ట్ శస్త్రచికిత్స(లెన్స్) అమర్చి ఉచితంగా చేస్తారన్నారు. కంటిమీద కండ, మెల్లకన్ను సరిచేయడం, కంటి శుక్లాలు ఉన్న పెద్దలకు, పిల్లలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తారని విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది తెలిపారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

చీడికాడ: మంచాల మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వెంకటలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. అదేరోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 110 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,720	5,170
రెండో రకం	4,390	4,420
మూడోరకం	3,700	4,010

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–18 యూనిట్లు, బీ పాజిటివ్–20 యూనిట్లు, ఓ పాజిటివ్–17 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

పెట్రోలులో కల్తీ

- బంకుల యజమానుల దోపిడీ
- పాడవుతున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు
- వాహనచోదకుల ఆగ్రహం



చోడవరం బంకులో కల్తీ పెట్రోల్ పోస్తున్న దృశ్యం

చోడవరం: అసలే పెట్రోల్, డీజిల్ ధరలకు అడ్డూ అదుపు లేకుండా పోతుండటంతో నిత్యం వినియోగదారుల జేబులకు చిల్లు పడుతోంది. దీనికితోడు రోకటి పోటులా పెట్రోలు బంకుల్లో యథేచ్ఛగా ఆయిల్ కల్తీ చేస్తుండటంతో లబోదిబోమంటున్నారు. వినియోగదారుల క్షేమాన్ని వదిలేసి, ఆయిల్ కల్తీ చేస్తూ పెట్రోల్ బంకుల నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారు. దీనివల్ల రూ.వేలు, రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసిన వాహనాలు మెకానిక్ షెడ్లకు చేరుతున్నాయి. ఇప్పుడు ఏ మెకానిక్ షెడ్లలో ఎక్కడ చూసినా ఇంజిన్ మరమ్మతులకు గురైన బళ్లే ఎక్కువగా ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ బంకులు సుమారు చోడవరం పరిసరాల్లోనే 15 బంకులు ఉన్నాయి. నిఘా అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వీటిలో ఆయిల్ కల్తీ ఎక్కువగా జరుగుతోంది. పెట్రోల్, డీజిల్‌లో ఇథనాయిల్, ఇతర కెమికల్ ఆయిల్స్ కలిపి కల్తీకి పాల్పడుతున్నారు. ఆయిల్ కల్తీతోపాటు కొన్ని బంకుల్లో భూమిలో ఉంచిన స్టోరేజ్ ఆయిల్ ట్యాంకర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల ఇటీవల కురిసిన వర్షపునీరు పెట్రోల్, డీజిల్ ట్యాంకుల్లో చేరి ఆయిల్‌లో కలిసిపోతుండగా ఆ కల్తీ ఆయిల్‌నే వాహనాలకు వేస్తున్నారు. ఇటీవల చోడవరం పరిసరాల్లో పెట్రోల్ బంకుల్లో ఈ తరహా కల్తీతో అనేక వాహనాలు మరమ్మతులతో మూలకు చేరాయి. చోడవరం, వెంకన్నపాలెం, వడ్డాది, మాడుగుల, అనకాపల్లి, సబ్బవరం ప్రాంతాల్లోని బంకుల్లో ఆయిల్ కల్తీ మరీ ఘోరంగా జరుగుతోంది. బంకులను ఎప్పటికప్పుడు పరిశీలించి, తనిఖీలు చేయాల్సిన విజిలెన్స్, రెవెన్యూ, కొలతలు–తూనికలు, పౌర సరఫరాల శాఖాధికారులు పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో ఈ శాఖల తనిఖీలు మొక్కుబడిగానే ఉన్నాయి. తనిఖీలు లేకపోవడం వల్ల పెట్రోల్ బంకుల యజమానులు ఇష్టారాజ్యంగా ఆయిల్ కల్తీలకు పాల్పడుతున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్ కల్తీ వల్లే ఇంజిన్లు పాడైపోతున్నాయని ధ్వజమెత్తుతున్నారు. మరమ్మతులతో వాహనాలు మార్గమధ్యలోనే నిలిచిపోవడం వల్ల దూరప్రాంతాలకు, అత్యవసర పనులపై వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని బంకుల్లో కొలతల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరలు లీటరు రూ.108కు పెరగడంతో ఆందోళన చెందుతున్న వాహనదారులకు ఆయిల్‌లో కల్తీ కారణంగా మరమ్మతులకు గురవుతున్న వాహనాలతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. తక్షణమే పెట్రోల్ బంకుల్లో ఆయిల్ కల్తీపై అధికారులు చర్యలు తీసుకోవాలని, కల్తీని అరికట్టాలని వాహదారులు కోరుతున్నారు.

ఆయిల్ కల్తీ వల్లే వాహన మరమ్మతులు...

చోడవరం బంకులో రూ.200 పెట్రోల్ కొట్టించాను. కొద్ది దూరం వెళ్లి బండి ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా స్టార్ట్ కాకపోవడంతో మెకానిక్ షెడ్‌కు తెచ్చాను. ఆయిల్ కల్తీ వల్లే ఇంజిన్ పట్టేసిందని తెలిసింది. పెట్రోల్ బంకుల్లో కల్తీని నివారించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్లే మా వాహనాలు పాడవుతున్నాయి. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వెంకటరమణ, వాహనచోదకుడు, వీరవిల్లి

ఆయిల్ కల్తీ చేసే కఠిన చర్యలు

ఆయిల్ కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవు. పెట్రోల్ బంకులపై తనిఖీలు ముమ్మరం చేస్తాం. ఆయిల్ వల్లే వాహనాలు మరమ్మతులకు గురైనట్టు భావిస్తే ఆ బంకుపై ఫిర్యాదు చేస్తే వెంటనే తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం. ఆయిల్ ట్యాంకర్ల నిర్వహణ సక్రమంగా చేయకపోతే బంకు యజమానులపై చర్యలు తీసుకుంటాం.

– వేణుగోపాలరావు, తహసీల్దార్, చోడవరం

తాగునీరు కలుషితం

బలిఘట్టంలో వారం రోజులుగా తాగునీటికి అవస్థలు



బురదనీరు



కుళాయిల నుంచి సరఫరా అవుతున్న బురదనీరు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి బలిఘట్టంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ వారు సరఫరా చేస్తున్న తాగునీరు బురదగా రావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఆరు వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. రోజు వారి కూలీ పనులు చేసుకునే వీరంతా పది రోజులుగా కుళాయిల నుంచి వస్తున్న బురద నీటిని పట్టుకుని వడగట్టి, బాగా తేరిన తర్వాత స్నానాలు, ఇంటి అవసరాలను తీర్చుకుంటున్నారు. ఒక పక్క ఎండలు మండుతున్నాయి. ఈ ఎండలకు తోడు బురదనీరు సరఫరా చేయడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. చేతి పంపుతో తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. ఆరు వేల కుటుంబాలకు చేతి పంపులు రెండు ఉన్నాయి. ఇవి సరిగా పని చేయటం లేదు. తమ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని బురదనీరు రాకుండా చర్యలు తీసుకుని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబును సంప్రదించగా ఈ ప్రాంతానికి చెందిన పంపుషెడ్డులో సాంకేతిక లోపం తలెత్తడంతో వేరే పంపుషెడ్డు నుంచి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 20 మంది ఎంపిక




ముకుందపురం పాఠశాలలో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు



వైద్య శిబిరంలో ఓపీ నమోదు చేసుకుంటున్న రోగులు

మాడుగుల రూరల్: విశాఖపట్నానికి చెందిన ఎల్.వి. ప్రసాదు కంటి ఆస్పత్రి సౌజన్యంతో ముకుందపురం ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కర్రి గణేష్ ప్రారంభించారు. 85 మంది రోగులకు ఆప్తాలమిక్ అసిస్టెంట్ వై. నాగలక్ష్మి పరీక్షించారు. వీరిలో 20 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. 25 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఎల్వీ ప్రసాదు కంటి ఆస్పత్రి సమన్వయకర్త ఆర్. స్వాములు, సిబ్బంది హర్ష, వర్షిణి, భాగ్యలక్ష్మి, గౌరీ, ఫీల్డ్ అధికారులు భూపతి, సంతోష్ పాల్గొన్నారు.

నల్లకొండమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం నేడు



అలంకరణతో నల్లకొండమ్మ తల్లి, తాండవ కాలువ గట్టున అమ్మవారి ఆలయం

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి నల్లకొండమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీసర్వం సిద్ధం చేసింది. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో కోలాటం, భజనలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం భారీ అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నాతవరం గ్రామ భక్తులు తాండవ ప్రాజెక్టుకు వెళ్లే దారిలో ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకున్న చెట్టు వద్ద అమ్మవారిని పూజించేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆలయాల నిర్మాణానికి ప్రాధ్యాన్యమిచ్చి నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా రూ.10 లక్షలతో ఇక్కడ తాండవ ఎడమ కాలువ ఒడ్డున నిర్మించారు. గతేడాది జూన్ 12న అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టరు రవిపట్టాన్‌శెట్టి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. అప్పట్నుంచి ఆలయంలో అమ్మవారు నిత్య పూజలందుకుంటున్నారు. అమ్మవారి దర్శనానికి ఆది, మంగళ, గురు, శుక్ర వారాలు భక్తులు అధికంగా వస్తుంటారు. భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో గురు, మంగళ, ఆదివారాలు ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మహిళల కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మోదమాంబ పాదాలకు జలాభిషేకం



కలశాలతో వెళ్తున్న మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్: మండలంలో వీరవల్లి అగ్రహారం మోదమాంబ అమ్మవారికి జలాభిషేకం చేశారు. గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు ఇంటి వద్ద అమ్మవారి పీఠం నుంచి 101 కలశాలతో మంగళవారం ఉదయం ఊరేగింపుగా ఆలయానికి చేశారు. అక్కడ ఆలయంలో అమ్మవారి పాదాలకు జలాభిషేకం చేశారు. అమ్మవారి మాలధారణ భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో 75 మంది మాలధారణ వేశారని గురుమాత శ్రీనివాసరావు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న వైద్యాధికారి పూజ్య మేఘన

దేవరాపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున డయేరియా, మలేరియా తదితర అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఆమె సిబ్బందికి వివరించారు. యాంటీ లార్వా ఆపరేషన్, ఈ ఆశా యాప్ అప్‌డేట్, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం వినియోగం, గర్భిణులకు టిఫా స్కాన్ తదితర అంశాల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా ప్రణాళికబద్ధంగా పని చేయాలని సూచించారు. సమావేశంలో సీహెచ్‌వో పి. ప్రసాదరావు, పీహెచ్ఎన్ సునీత, హెచ్.వి. లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్ తదితర్లు పాల్గొన్నారు.

మూలకు చేరిన మరుగుదొడ్లతో అవస్థలు



వినియోగంలో లేని మరుగుదొడ్లు

మాకవరపాలెం: మూలకు చేరిన మరుగుదొడ్లతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు చాలా కాలంగా మూలకు చేరాయి. దీంతో నిత్యం ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మహిళల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దీంతోపాటు తాగునీరు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే తాగునీటి సమస్యతోపాటు మరుగుదొడ్లను వినయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు



వారాడలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సాయికిరణ్

కె.కోటపాడు: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలను పాటించాల్సిన అవసరం ఉందని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిరణ్ తెలిపారు. మంగళవారం వారాడలో 137 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇంటి పరిసరాల్లో ఎక్కువ రోజుల పాటు మురుగు ఉండడం వలన దోమల వృద్ధి చెందుతాయన్నారు. ఈ కారణంగా మలేరియా, డెంగ్యూ బారిన పడతారన్నారు. మురుగునీటిని ప్రతీ వారానికి ఒక రోజు తొలగించుకోవడాన్ని ప్రజలు బాధ్యతగా గుర్తించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ సుమ, ఏఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్యశ్రీలో స్కానింగ్

వైద్యాధికారి కె.ఎం. నాయుడు

మాడుగుల రూరల్: గర్భిణులకు విధిగా స్కానింగ్ చేయించాలని, దీనికి గాను ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద నిధులు మంజూరు చేస్తుందని కింతలి పీహెచ్‌సీ డాక్టర్ కె.ఎం. నాయుడు తెలిపారు. ఆశ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు మాసాల వ్యవధిలో గర్భిణులకు విధిగా స్కానింగ్ చేయడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుత సీజన్‌లో డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవల గురించి వివరించారు. మరో వైద్యాధికారి బి. రవితేజ మాట్లాడారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కె.జె.పురం పీహెచ్‌సీలో..

ఆశ కార్యకర్తల సమావేశం మంగళవారం కె.జె.పురం పీహెచ్‌సీలో నిర్వహించారు. సీహెచ్‌వో సీహెచ్ పుష్పమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గర్భిణులకు స్కానింగ్, డయేరియా నివారణ, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు గురించి సమీక్షించారు. సమావేశంలో పీహెచ్ఎన్ ఎం. ఇందిర, ఆశ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ

దేవరాపల్లి: స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ వరి విత్తనాలను సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. ఖరీఫ్ సాగులో మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక రైతు భరోసా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్లు కె. సత్యారావు, భాగ్యశ్రీ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీసెట్‌లో ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ సత్తిబాబు, బాబ్జి

నర్సీపట్నం: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీప్రగతి కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. కళాశాలలో ఇంటర్మీడియట్ అభ్యసించిన ఎస్.శరిష్మా 2,247, కె.పావని 3,259, వి.షారోన్ శాంతికుమారి 2,985, సిహెచ్.కోటి లోక్‌తేజ 6,475 ర్యాంక్‌లు సాధించారు. వీరిని కరస్పాండెంట్ యు.సత్తిబాబు, ప్రిన్సిపాల్ ఎ.బాబ్జి అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటా ధర్మ ప్రచారం

అచ్యుతాపురం: ఎం.జగన్నాథపురంలో ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహించారు. మంగళనవారం జరిగిన ఈ కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి నియోజకవర్గ సంయోజకులు బి.వి. రమణ మాట్లాడుతూ సనాతన ధర్మం, సంప్రదాయాలలో ఎన్నో నిబంధనలు ఉంటాయన్నారు. కొల్లి అప్పారావు, రాము, ఆనంద్ పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థతో సత్వర న్యాయం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ



సదస్సులో మాట్లాడుతున్న వెంకట శేషమ్మ



హాజరైన గొరపల్లి గ్రామస్తులు

పెందుర్తి: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నిరుపేదలకు సత్వర న్యాయం అందుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. మండలంలోని గొరపల్లిలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.3 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు న్యాయ సహాయం అవసరం అయితే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ప్రతీ గ్రామాన్ని వ్యాజ్యాలు లేని గ్రామాలుగా మార్చడానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ వై.ఎస్ రంగలక్ష్మి, ఆర్ఐ సాయికిరణ్, సీడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి రాజు, సర్పంచ్ గొరపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్కారీ విద్యార్థులకే తల్లికి వందనం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గొంది చిన్నబ్బాయ్

అనకాపల్లి: కొత్తగా కొలువుదీరనున్న ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, జీవో నెం.117ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్‌సీని కొత్త ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం పీఆర్సీ కమిషన్‌ను నియమించిందని, ఈ ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్ససాయి శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు కట్టా శ్రీను, గాయత్రి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు చంద్రరావు, జీఎస్ ప్రకాష్, చైతన్య, శేషబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



ట్రోఫీ ఆవిష్కరించిన సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సిన్హా, ఇతర అధికారులు

పరవాడ: క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన ఐ ఆర్ ఎస్ ఎం వాలీబాల్, త్రోబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సిన్హా మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. పవర్ పరిశ్రమల నుంచి విచ్చేసిన ఉద్యోగులు, యువతకు పోటీలు నిర్వహించారు. రామగుండం, తెలంగాణ, కుడ్గీ, సదరన్ రీజియన్ హెచ్‌క్యూ, సింహాద్రి స్టేషన్లకు చెందిన టీంలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా ట్రోఫీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీజీఎం ఆర్.ఆర్ పరిదా, ఓ అండ్ ఎం జీఎం డేవిడ్, ఇతర ప్రముఖులు, జీఎంలు డేవిడ్, వి.టి కాంబ్లే, ఎస్.పద్మప్రియ, హెచ్‌వో హెచ్ఆర్ బి.బి.పాత్ర, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్యం కోసం చదువుకుంటే ఉన్నత శిఖరాలు

మునగపాక: విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని డీఈవో ఎం.వెంకటలక్ష్మి అన్నారు. చదువులో ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతిలో మెరుగైన మార్కులు సాధించిన లావేటి హాసిని, ఆడారి వేణుశ్రీ, యల్లపు శ్రావ్యలు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ జూనియర్ శశక్తి విభాగంలో ఎంపికైన నేపథ్యంలో మంగళవారం వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విశేష ప్రతిభ చూపిన విద్యార్థులకు అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. ఇన్‌చార్జి హెచ్ఎం సోమయాజులు, విశ్రాంత హెచ్ఎం ఎంబీ కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, సీఆర్పీ గోవింద పాల్గొన్నారు.